క్లుప్తంగా

కనక దుర్గమాంబ జాతర ప్రారంభం



అమ్మవారికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో కొలువుదీరిన శ్రీకనక దుర్గమాంబ అమ్మవారి వార్షిక జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. శ్రీకృష్ణా ఉమమహేశ్వర సాయి దుర్గా యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు గొలగాని రాము, ప్రసాదు పోలారావు, అధ్యక్షుడు ఈగల శివ గోవింద్, పల్లా అప్పారావు, బొట్టా గణేష్, బొట్టా లింగేష్, పల్లా శివ, మువ్వల శ్రీను, ప్రసాదుల అప్పారావు, మాజీ అధ్యక్షుడు బొట్టా శివ, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మంగళవారం అమ్మవారి ప్రధాన జాతర నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

పెన్షనర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



కొత్త కమిటీ కార్యవర్గ సభ్యులు

మద్దిలపాలెం : కొత్త వెంకోజీపాలెం విశ్రాంత ఉద్యోగుల అండ్ ఫ్యామిలీ పెన్షనర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. రెండేళ్ల కాల పరిమితికి గాను ఏర్పాటైన కార్యవర్గం అధ్యక్షుడిగా బోరా నూకారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పీలా రమణ, కార్యదర్శిగా కాళ్ల సూరిబాబు, కోశాధికారిగా మద్దాల ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా డి.నూకరాజు, సలహాదారులుగా దాడి పరదేశిరావు, మద్దాల నరసింగరావు, ఇతర కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. పూర్తి వివరాలకు 0891-2711725, 2566514 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆలయ అధికారులు కోరారు.

నేటి నుంచి అమ్మవారి మహోత్సవాలు



మొగధారమ్మ అమ్మవారు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడ, ముసలయ్యపాలెం ఆరాధ్య దేవతలు శ్రీ మొగధారమ్మ, శ్రీ దుర్గాలమ్మ, శ్రీనూకాలమ్మ అమ్మవార్ల ప్రధాన పండగ మంగళవారం నుంచి వైభవంగా నిర్వహించనున్నారు. రెండు రోజులపాటు నిర్వహించే మహోత్సవాలకు నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నామని తెలిపారు.

కొత్త కొత్తగా వసతి గృహం

- ఎస్సీ బాలుర హాస్టల్ ఆధునికీకరణ
- రూ.38 లక్షలతో పలు వసతుల కల్పన



రైల్ ఇంజిన్ ఆకృతిలో ప్రవేశ మార్గం



ఆకర్షించే డాగ్



సుందరంగా ఎస్సీ బాలుర వసతిగృహం

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-4లో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం రూపు మారింది. జిల్లా కలెక్టర్ చొరవతో ఈ వసతిగృహానికి కొత్త లుక్ వచ్చింది. ముఖద్వారం రైలు ఆకారంతో వినూత్నంగా నిర్మించిన ఈ వసతిగృహంలో ప్రస్తుతం 50కు పైగా విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. దశాబ్దాలుగా ఈ వసతిగృహం పూర్తిస్థాయి ఆధునీకరణకు నోచుకోలేదు. జిల్లా కలెక్టర్ మల్లికార్జున చొరవతో సీఎస్‌ఆర్‌లో భాగంగా ఈ వసతిగృహాన్ని ఆధునీకరించేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. దీంతో ఆకర్షించే రంగులు, అత్యాధునిక సౌకర్యాలతో ఈ వసతి గృహం ప్రస్తుతం కొత్త లుక్‌ను సంతరించుకుంది.

రూ.38 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో..

రూ.38 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్టల్ ఆధునికీకరణ పనులు జరిగాయి. 50 నుంచి 70 మంది విద్యార్థులు ఈ వసతిగృహంలో ఉండేందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించారు. ఇటీవల ఆయా సౌకర్యాలను కలెక్టర్ మల్లికార్జున ప్రారంభించారు. వసతి గృహాన్ని పూర్తిస్థాయి ఆధునీకరించి రంగులు వేయడంతో పాటు మరుగుదొడ్లు, ఫ్లోరింగ్ మరమ్మతులు, స్నానాల ప్రాంగణం, హ్యాండ్ వాష్ ప్రాంగణం, వాటర్ ప్యూరిఫైడ్ ట్యాంక్స్ ఇలా అన్నింటా సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం ఈ హాస్టర్ సర్వాంగ సుందరంగా దర్శనమిస్తోంది. సెలవులు పూర్తి కావస్తుండడంతో 1 నుంచి 5 తరగతి వరకు విద్యార్థులు ఈ వసతి గృహ సేవలను వినియోగించుకోనున్నారు.



విద్యార్థుల స్నానాల ప్రాంగణం



హాస్టల్‌లో వసతులు పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున(ఫైల్)

భక్తిశ్రద్ధలతో బక్రీద్

మద్దిలపాలెం : త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్‌ను సోమవారం రేసపువానిపాలెం మంగాపురం కాలనీలో తారా మసీదులో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచి ముస్లింలు మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తారా మసీదు, రేసపువానిపాలెంలో మసీదులకు విద్యుద్దీపాలంకరణ చేశారు. ఇబ్రహీం భక్తికి, త్యాగానికి గుర్తుగా ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్‌ను జరుపుకొంటారని ముస్లిం పెద్దలు తెలిపారు. ఒకరికి ఒకరు బక్రీద్, ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



రేసపువానిపాలెంలో విద్యుద్దీపాల అలంకరణలో మసీద్

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో స్వామి పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: తోటగరువులోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా సోమవారం ఆలయ ఆవరణలో ధ్వజ స్తంభం, లక్ష్మీ గోదా సమేత గరుడ విగ్రహం ఆవిష్కరణ చేశారు. అనంతరం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణం న్విహించారు. భక్తిశ్రద్ధలతో హోమం జరిపారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో యువతకు ప్రాధాన్యం అభినందనీయం



మాట్లాడుతున్న మేడపాటి రవీంద్ర

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర మంత్రివర్గంలో యువతకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని బీజేపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. సోమవారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు తీసుకున్న అనంతరం తీసుకుంటున్న నిర్ణయాలు హర్షణీయమన్నారు. రూ.400 కోట్ల ప్రజాధనంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుషికొండపై విలాసవంతమైన భవంతులు నిర్మించడాన్ని తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు

కూరగాయల ధరల మోత

సీతమ్మధార: వేసవి సీజన్ ముగుస్తున్న తరుణంలో కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమైన పండగలు లేని ఈ నెలలోనే కూరగాయల ధరలు ఇలా ఉంటే.. వచ్చే నెల ఇంకెంత పెరుగుతాయోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు పలు ప్రాంతాల్లో పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గి, డిమాండ్ పెరిగిన కారణంగా ధరలు పెరుగుతున్నాయని భావిస్తున్నారు. టమాటా తదితర కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయని విచారం వ్యక్తం చేస్తున్నారు. పలు రకాల కూరగాయల ధరల కిలో రూ.50 పైమాటే పలకడం గమనార్హం. రైతుబజార్‌లో సోమవారం కిలో టమాటా ధర రూ.52 పలికింది. గత వారం రూ.44గా ఉంది. అల్లం ప్రస్తుతం రూ.170 పలుకుతోంది. కాకరకాయల ధర రూ.30 నుంచి రూ.50కు పెరిగింది. దొండకాయలు కిలో రూ.24 నుంచి రూ.40కు, పచ్చిమిర్చి రూ.50 నుంచి రూ.60, క్యాప్సికమ్ రూ.70 నుంచి రూ.90కు పెరిగింది. ఉల్లిపాయల ధర కిలో రూ.35 పలుకుతోంది.



సీతమ్మధార రైతుబజార్‌లో టమాటా స్టాల్

బహిరంగ మార్కెట్‌లోనూ రెక్కలు..

రైతుబజార్, పూర్ణా మార్కెట్, జ్ఞానాపురం హోల్ సేల్ మార్కెట్‌లో కూడా కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. బహిరంగ మార్కెట్‌లో టమాటా ధర రూ.60 నుంచి రూ.70 పలుకుతోంది. ఉల్లిపాయల ధర రూ.40 నుంచి రూ.50, దొండకాయల ధర రూ.50 నుంచి రూ.60 వరకు ఉంది.

ముగిసిన శ్రీవిద్య ప్రారంభిక కోర్సు



గురుమాత అన్నపూర్ణమ్మతో శ్రీవిద్య కోర్సు నేర్చుకున్న విద్యార్థులు

సబ్బవరం:ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన శ్రీవిద్య ప్రారంభిక కోర్సు సోమవారంతో ముగిసింది. ఈ నెల 14 నుంచి నిర్వహించిన ఈ కోర్సులో చెన్నై, కోయంబత్తూర్,ఆగ్రా,కోల్‌కతా బెంగళూర్,రాయపూర్,ఢిల్లీతో పాటు యూరప్‌లోని లాత్వియా నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. కోర్సులో భాగంగా ప్రధాన అంశాలైన మంత్ర సాధన,యంత్ర పూజలు,తర్పణాల థియరీతో పాటు ఆచరణ పూర్వకంగా ఉపాసనా విధానాలను వివరించారు. తమంతట తాము హోమాలు చేసుకోగలిగే స్థాయిలో శిక్షణ ఇచ్చారని ఆచార్యులతో పాటు గురుమాత అన్నపూర్ణమ్మకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కందర్ప ప్రభాకర్, ఆచార్యులు మూర్తి రాధ,కందర్ప రమ,వి. షణ్ముఖేశ్వరన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



ట్రాలర్ ఆగిపోవడంతో జాతీయ రహదారిపై తాళ్లవలస వద్ద రైలింజన్

జాతీయ రహదారిపై రైలింజన్

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై సోమవారం ఒక భారీ ట్రాలర్ సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. తమిళనాడు నుంచి కోల్‌కత్తా వైపు ఈ ట్రాలర్ రైలింజిన్‌ను తీసుకుని వెళ్తోంది. మధ్యలో మొరాయించడంతో ట్రాలర్‌ను అక్కడే నిలిపివేసి దాని ఇంజిన్‌ను మరమ్మతులకు తరలించారు. రహదారిపై ఆగిపోయిన రైలింజిన్ వద్ద వాహనదారులు ఆగి సెల్ఫీలు తీసుకుని మురిసిపోయారు.

'కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం తగదు'

దాబాగార్డెన్స్: ఉన్నత విద్యా సంస్థలు, విశ్వ విద్యాలయాల్లో సిలబస్, పాఠ్యాంశాలకు సంబంధించి సంబంధిత చట్టబద్ధమైన కౌన్సిల్ ఆమోదం లేకుండా కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం సమర్థనీయం కాదని భారత ప్రభుత్వ ప్రత్యేకాధికారి జి.సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత సాంప్రదాయ విద్యా విధానం ప్రకారం ఉన్నత విద్యా వ్యవస్థలో నియమాలు, పాఠ్యాంశాలు, సిలబస్‌లు నిర్ణయించే భారత ప్రభుత్వ సంస్థలు మాత్రమే యూజీ/పీజీ/పీహెచ్‌డీ విద్యార్థుల ఉత్తీర్ణతను నిర్ణయించడానికి అర్హులన్నారు. ఉన్నత విద్యా సంస్థలు, విశ్వ విద్యాలయాల్లో ప్రవేశం పొందిన బ్యాచిలర్, మాస్టర్స్, డాక్టర్, డిగ్రీ విద్యార్థులకు యూజీసీ, వారి చట్టబద్ధమైన కౌన్సిల్ నిర్వహించే డిగ్రీ ఫైనల్ పబ్లిక్ పరీక్షలకు హాజరు, ఉత్తీర్ణత తప్పనిసరన్నారు.

జీవో 117 రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇమంది

ఆరిలోవ: ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారిన **జీవో 117ను వెంటనే** రద్దు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ యూనియన్(ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడు **ఇమంది సత్యనారాయణ** కోరారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ 10వ వార్డు ఎస్ఐజీ నగర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. సమస్యలు పరిష్కారానికి ఎస్టీయూ కార్యవర్గం కృషి చేయాని నిర్ణయించారు. అనంతరం ఇమంది మాట్లాడుతూ 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల డ్రాప్ అవుట్ల సంఖ్య పెరిగిపోతుందన్నారు. విద్యా వ్యవస్థలో పర్యవేక్షణ పేరుతో ఉన్న యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇంగ్లిష్ మీడియంతో సమానంగా తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చంద్ర పద్మావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దేవుడుబాబు, ఉపాధ్యక్షుడు కె.ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు



మేళాలో అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్తంగా సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాకు 1230 మంది రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. వారిలో 364 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారన్నారు. మేళాకు సమన్వయకర్తగా జవహర్ నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్ రాజు మేళా విజయవంతానికి కృషి చేశారన్నారు. ఇలాంటి క్యాంపస్ డ్రైవ్‌లను మరిన్ని కళాశాల వేదికగా నిర్వహించాలని ఆయన కోరారు.

వేధిస్తున్న అనధికారిక విద్యుత్ కోతలు

ఆరిలోవ: ఆరిలోవలో అనధికారిక విద్యుత్ కోతలు వేధిస్తున్నాయి. రోజూ ఏదో ఒక సమయంలో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, టీఐసీ, పాయింట్, లీలాసుందరినగర్, సుందరయ్యకాలనీ, శ్రీకాంత్‌నగర్, బాలాజీనగర్, తోటగరువు, చినగదిలి, పెదగదిలి, ఆదర్శ్‌నగర్, ఇందిరాగాంధీనగర్, తదితర ప్రాంతాలలో రోజూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆదివారం రాత్రి 10 నుంచి సుమారు గంటన్నర పాటు విద్యుత్ సరఫరా నిలిపేశారు. సోమవారం సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ కోత విధించారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా రోజూ ఇదే విధంగా కరెంట్ కోతలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఓ పక్క ఎండలు మండిపోయి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనాలకు కరెంట్ కోతలు మరింత ఇబ్బంది కలిగిస్తున్నాయి. వారంలో రెండు రోజుల పాటు విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్నామంటూ అధికారికంగా ఉదయం నుంచి సాయత్రం వరకు సిబ్బంది సరఫరా నిలిపేస్తున్నారు. దీనికి తోడు అనధికారికంగా గంటల తరబడి కోతలు పెట్టడం దారుణమని ఆయా కాలనీలవాసులు మండిపడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ కోతలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

భూమిని కాపాడే బాధ్యత మనదే



పర్యావరణ పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, పీఆర్ గార్డెన్స్ యూత్, జేవీ రత్నం, టీం సభ్యులు

మద్దిపాలెం: భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. 49వ వార్డు పట్టాభిరెడ్డి తోటలో పట్టాభిరెడ్డి గార్డెన్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ పర్యావరణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన భూమిని మనమే కాపాడుకోవాలని, ప్రతి ఒక్కరూ ప్రకృతి ఆధారిత పంటలు పండించిన ఆహారాన్నే ఆరగించాలన్నారు. విశాఖలో అమలవుతున్న ఎకో వైజాగ్‌లో భాగంగా మొక్కలు నాటి, వాటిని పెంచి విజయవంతం చేయాలని కోరారు. అడ్వకేట్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ప్రతి ఏటా 500 మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అందరూ పర్యావరణ హితంగా జీవించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. సంస్థ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టాభిరెడ్డి తోట అనే పేరు నిలబెట్టేందుకు తమ ప్రాంతానికి చెందిన వారందరినీ కలిపి ఒక పథకం ప్రకారం పచ్చని తోటగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కోటేశ్వరరావు, కోశాధికారి గణేష్, సహాయ కార్యదర్శి సంతోష్, పలువురు విద్యార్థులు పాల్గొని మాట్లాడారు.

సేఫ్టీ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్స్



సేఫ్టీ ప్రాక్టికల్స్ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు



కెమికల్ సేఫ్టీని వివరిస్తున్న నిపుణుడు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్న సేఫ్టీ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్లు గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఆదివారం నుంచి విద్యార్థులకు థియరీకి అనుగుణంగా ప్రాక్టికల్స్ షెడ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ, కెమికల్ ఇంజినీరింగ్ సేఫ్టీ కోర్సుల్లో విద్యార్థులు ఈ ప్రాక్టికల్స్‌లో ప్రత్యక్షంగా పాల్గొని నైపుణ్యాలను సాధిస్తున్నారని, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కోర్సు కో ఆర్డినేటర్ ఎ.వరహాలు పర్యవేక్షణలో సేఫ్టీ కోర్సు ఫ్యాకల్టీ డి.తులసీరావు విద్యార్థులకు ప్రయోగాత్మక బోధన నిర్వహించారు.

జోరుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న పోలీసులు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన చోదకులను తనిఖీ చేశారు. సాయంత్రం వేళల్లో పలువురు వాహన చోదకులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా ఆయా ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జోరుగా నిర్వహిస్తున్నారు. ఫలితంగా నగరంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గిందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. స్థానిక పాలాక్ స్కూల్, గురుద్వారా, ద్వారకానగర్, అల్లూరి సీతారామరాజు జంక్షన్ తదితర కూడళ్ల వద్ద పోలీసులు వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భాస్కరరావు మాట్లాడుతూ వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడపడం తోటి ప్రయాణికులకు కూడా ప్రమాదకరమని హెచ్చరించారు. కుటుంబ సభ్యుల శ్రేయస్సు దృష్ట్యా డ్రంక్ అండ్ డ్రైవ్ అలవాటు మానుకోవాలని ఆయన హితవు పలికారు.